క్లుప్తంగా

ప్రతీ కార్యకర్తకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతీ కార్యకర్తకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గణేష్‌కు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో రూ.2లక్షల ప్రమాద బీమాను కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

చిట్కుల్ సర్పంచ్ నీలం మధు



క్రీడా దుస్తులను అందజేస్తున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామీణ క్రీడాకారులకు అండగా ఉంటానని చిట్కుల్ సర్పంచ్ నీలం మధు తెలిపారు. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ వాలీబాల్ క్రీడాకారులకు నీలం మధు టీషర్టులు, క్రీడా కిట్‌లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లేకపోవడంతోనే వారి ప్రతిభ మరుగున పడుతుందన్నారు. క్రీడాకారులను గుర్తించి వారిని ప్రొత్సహించాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి



అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పిస్తున్న జన్యా నాయక్

పటాన్‌చెరు టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్యా నాయక్ అన్నారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరికరాల పనితీరు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అగ్నిప్రమాదాల పట్ల ప్రతీ ఒకరికి చైతన్యం కల్పించేందుకు వారోత్సవాలు నిర్వహించామన్నారు.

23న ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఆస్పత్రి డైరెక్టర్లు

జోగిపేట(అందోల్): ఈ నెల 23వ తేదీన జోగిపేట పట్టణంలోని ధ్రువ ఆస్పత్రి ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి డైరెక్టర్లు సంతోష్, ఆకుల చిట్టిబాబు, ఆస్పత్రి డాక్టర్ నవీన్‌లు తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జోగిపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ భారతి, జనరల్ డాక్టర్ నవీన్, ఎముకలు, కీళ్ల వైద్యురాలు డాక్టర్ అనూష, చర్మవైద్య నిపుణురాలు డాక్టర్ సాయి పూజితలు ఈ శిబిరంలో పాల్గొంటున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు.

కాలనీల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తున్నామని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 19వ వార్డులో నిర్మించనున్న యూజీడీ పనులకు గురువారం రోజారాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సంధ్య వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటా



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఖదీర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిరుపేదలకు అండగా ఉంటానని ఏకే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్ అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలో ఏకే ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను ముస్లిం పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌ను సంతోష వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశం

- 800 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- లబ్ధిదారుల సంక్షేమానికి కృషి
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): నిరుద్యోగులు ఉపాధి అవకాశం పొందడం కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం మండలంలోని మునిపల్లిలో లబ్ధిదారులకు చెక్కులు, రంజాన్ దుస్తుల పంపిణీ చేశారు. మునిపల్లిలో ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ మండలంలోని లింగంపల్లి, కంకోల్, గ్రామ శివారులోని భూములతో పాటు జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాల భూమిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూ యజమానులు, రైతులు ముందుకు వచ్చి భూములను ఇవ్వాలన్నారు. భూములిచ్చిన రైతులకు రూ.15లక్షలతో పాటు 100 గజాల ఇంటి స్థలం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం పరిహారంగా ఇస్తామన్నారు. లింగంపల్లి గ్రామానికి చెందిన 23 మంది రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు భూములు ఇచ్చారన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా జేఎన్‌టీయూ ఏర్పాటుకు రైతుల నుంచి భూములు తీసుకున్నారే తప్పా ఆ రైతులకు పరిహారం ఇప్పించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి సర్పంచ్ రమేశ్, జడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాబా పటేల్, తహసీల్దార్ శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కృపదానం, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే అటు నుంచి ఇటు

- వార్డు సభ్యుడిని పార్టీలో చేర్చుకున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



శంకర్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరికి వారు పోటాపోటీగా వ్యవహరిస్తున్నారు. అందోల్ మండలం ఎర్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పంచాయతీ వార్డు సభ్యుడు శంకర్ బుధవారం మాజీ డిప్యూటీ సీఎం సి.దామోదర్ రాజనర్సింహా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరుసటి రోజు(గురువారం) ఉదయమే బీఆర్ఎస్‌కి చెందిన సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి వార్డు సభ్యుడు శంకర్‌కు నచ్చజెప్పారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ శంకర్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యాక్షుడు మహేశ్వర్‌రెడ్డి గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.



రుద్రారంలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మునిపల్లి(అందోల్): ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు సన్మానిస్తున్న దృశ్యం

ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలు

పండగలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. జిల్లాల్లో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మునిపల్లిలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, హత్నూరలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నారాయణఖేడ్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలో ఇఫ్తార్ విందు



హత్నూరలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నారాయణఖేడ్: ఇఫ్తార్ విందులో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ



రాయికోడ్: ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ నాయకులు



జహీరాబాద్: మాట్లాడుతున్న బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర స్వామి

సంగమేశ్వర మందిరంలో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో మాధవనందసరస్వతీ స్వామి మాదుగుల సర్వోత్తమశర్మ దంపతులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీ సంగమేశ్వర మందిరంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో శ్రీమాదుగుల సర్వోత్తమశర్మ దంపతులు సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల ఉద్ధవ్, జ్యోషి మంత్రోచ్ఛరణాల మధ్య నిర్వహించారు. కౌన్సిలర్ ఆకుల శివకుమార్, ఆలయ పుజారులు జి. మోహన్‌రావు, బిఎన్. శంకర్‌రావు, నారాయణ రావు, మనోహర్‌శర్మ, కిషన్‌రావు, సత్యానారాయణ కులకర్ణి, నర్సింహరావు, మారేపల్లి శివకుమార్, మునిగి మల్లేశం, పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి నస్తీపూర్ మసీదులో బీఆర్ఎస్ నేత మధు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్, సర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బసవ జయంతికి సహకరించాలి



కలెక్టర్ శరత్‌ను కలిసిన వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు

సంగారెడ్డిటౌన్: ఈ నెల 23వ తేదీన విశ్వగురు మహాత్మా బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించేలా సహకరించాలని వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు కలెక్టర్ శరత్‌ని కోరారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాది మధుశేకర్, ఇప్పపల్లి నర్సింలు, మల్లికార్జున్, శివరాజ్ పాటిల్, కంది వీరేశం, తదిరులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌రెడ్డికి మంత్రి అభినందన



మంత్రి హరీష్‌రావుతో వరప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమలో ఇటీవల జరిగిన కార్మిక ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున వరప్రసాద్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలిచినందుకు గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో గెలుపొందిన వరప్రసాద్‌రెడ్డిని మంత్రి హరీష్‌రావు అభినందించారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి



సదాశివపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

సదాశివపేట(సంగారెడ్డి): పెరిగిన ధరలకు అనుగుణంగా వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు వి. ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సదాశివపేట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, నాగరాజ్, అంజనేయులు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఇందిరా క్రాంతి పథకంలో పని చేస్తున్న వీఓఏలను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న ఆకాశ్

కొండాపూర్(సంగారెడ్డి): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సెక్రటరీ, బోర్డు మెంబెర్స్‌ని అరెస్ట్ చేసి విచారించాలన్నారు.

సాగు చట్టాలపై అవగాహన

పుల్‌కల్(అందోల్): రైతులు సాగు చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి శాలిని తెలిపారు. గురువారం గొంగ్లూర్ రైతు వేదికలో 'అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సాగుచట్టాలపై అవగాహన లేక పోవడంతో దళారీలను నమ్మి మోసపోతున్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు ఎమ్మెల్యే రాక

రాయికోడ్(అందోల్): రాయికోడ్ గ్రామానికి శుక్రవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వస్తారని మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, రంజాన్ దుస్తులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ప్రభులు తెలిపారు.

◆ పాటల సీడీ ఆవిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ జన్మదినం సందర్భంగా గాయకుడు, రచయిత నగేశ్‌చారి పాటల సీడీని రూపొందించాడు. ఈ సీడీని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ గురువారం శివానగర్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల శ్రీనివాస్, మంద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ మల్లికార్జున్ నగర్ కాలనీలో ముఖాముఖి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ కాలనీలో గురువారం ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ బాలయ్య పాల్గొన్నారు. కాలనీ వాసులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాం రెడ్డి, బబూరుగడ్డ నగేష, కాలనీవాసులు విఠల్, బాల్‌రెడ్డి, అరణ్ సింగ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ మసీదు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్ పాల్గొన్నారు.

◆ రంజాన్ కిట్ల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): అత్నూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం ప్రజా ప్రతినిధులు, నాయకులు రంజాన్ కిట్లను పేదలకు అందజేశారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్, రఫీయోద్దీన్, సంగ్రాం పాటిల్, ఇలియాస్, నీలయ్యగౌడ్, సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

◆ నిధులు మంజూరు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఖాంజమల్‌పూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్, మాడ్గిలో చర్చి కంపౌండ్‌వాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరయ్యాయి. జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ విజయమోహన్‌రెడ్డి గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు షకీల్, తుకారాం, సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ గొర్రెల పంపిణీ సద్వినియోగం చేసుకోవాలి

వట్‌పల్లి(అందోల్): రెండోవిడత గొర్రెల పంపిణీని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం వట్‌పల్లి రైతువేదిక భవనంలో గొల్లకుర్మల సంఘాలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పాండ్యన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వర్, వరము చైర్మెన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్ధిరెడ్డి, సర్పంచ్ నారాయణగౌడ్, ఎల్లయ్య, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణ కరపత్రాల విడుదల

జహీరాబాద్: జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. జహీరాబాద్‌లోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన వెంకటాపూర్‌లో ఎంఆర్‌పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కో–కన్వీనర్ అబ్రహం మాదిగ, చిన్న, రవి, వసంత్, భిక్షపతి, అశోక్, జైరాజ్ పాల్గొన్నారు.

◆ రంజాన్ సందర్భంగా పాలవిక్రయ కేంద్రాలు

నారాయణఖేడ్: రంజాన్ సందర్భంగా తెల్లవారు జామున 4గంటల నుంచి ఉదయం 8గంటల వరకూ ముస్లీంల సౌకర్యార్థం విజయాడెయిరీ తరపున నారాయణఖేడ్‌తోపాటు నిజాంపేట్‌లో ప్రత్యేక పాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పాలశీతలీకరణ కేంద్రం మేనేజరు రాములు తెలిపారు. ఖేడ్ పట్టణంలోని కిందిగల్లీ, హష్మీ మజీద్, రాయిపల్లిరోడ్‌లోని ఇబ్రహీమ్యా మసీదు, పోలీస్‌స్టేషన్, ఈత్వార్‌పేట్‌లోని ఖురేషి మసీదు, మంగల్‌పేట్‌లోని పాత పాలశీతలీకరణ కేంద్రం, నిజాంపేట్‌లో మసీదు వద్ద విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

◆ పేద కుటుంబాలకు చేయూత

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గంలో విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కుటుంబాల దీన పరిస్థితులు తెలుసుకుని సరుకులను పంపిణీ చేశామన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, పొట్టి ప్రవీణ్‌కుమార్, అరుణ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ వృద్ధురాలు మృతి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో గల శ్రీరాంనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న 110 ఏళ్ల బాలమణి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అనంద్ కృష్ణారెడ్డి అంత్యక్రియలకు సాయం చేశారు.

◆ దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

పటాన్‌చెరు టౌన్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని జేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ జైపాల్ అన్నారు. గురువారం పట్టణంలోని జేపీ లయన్స్ క్లబ్ ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రమణ, మతిన్, అమరేందర్, పద్మభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తోటి కార్మికులు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ జయశ్రీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తోటి కార్మికులు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత కృష్ణ, కాంట్రాక్టర్ మాధవరెడ్డి, లింగం, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం చిక్‌మద్దూర్లో సర్పంచ్ వీరన్న గారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ కంటి వెలుగును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామామణి, డాక్టర్ వినయ్ కుమార్, రాందాస్, ఏఎన్ఎంలు శ్రీలత, వినయ కుమారి, ప్రేమ, ఆశా వర్కర్లు లక్ష్మీ, యశోద, రేఖ, పాల్గొన్నారు.

◆ నేడు అమీన్‌పూర్‌లో సబ్ పోస్టాఫీస్ ప్రారంభం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పరిధిలోని సాయిబాబా దేవస్థానం వద్ద శుక్రవారం సబ్ పోస్ట్ ఆఫీస్‌ను ఆవిష్కరిస్తారని, ఉదయం 11:30 ఉంటుందని పోస్టల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సర్కిల్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత విచ్చేయనున్నట్లు తెలిపారు.

◆ నిర్మాణ కార్మికులకు నిపుణ్ శిక్షణ ఉపయోగం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిర్మాణ కార్మికులకు నిపుణ్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎస్. దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లోని ముప్పాస్ మెలోడీలో నిర్వహించిన ది నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అప్‌స్కిల్లింగ్ ఆఫ్ నిర్మాణ్ వర్కర్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికులు ఈ శిక్షణ తరగతులు వలన ఎంతో ప్రయోజనం ఉంటుందాన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఆర్ఈడీసీఓ తెలంగాణ అధ్యక్షుడు సునిల్ చంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ విజయసాయి, ముప్పా హోమ్స్ చైర్మన్ ముప్పా వెంకయ్య చౌదరిలు పాల్గొన్నారు.

◆ ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): నస్తీపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను తట్టుకునేందుకుగాను ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ఏపీవో పవన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఇక్యమత్యం చాటుదాం

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు పట్లోల్ల సంగమేశ్వర్ జన్మదిన వేడుకలు సంగారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. జిల్లాలోని పలువురు సభ్యులు ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

మునిపల్లి(అందోల్): అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం మునిపల్లిలో నిర్వహించిన దుస్తుల పంపిణీలో బీఆర్ఎస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. పాత, కొత్త అని తేడా లేకుండా బీఆర్ఎస్ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

◆ టౌన్‌షిప్ పరిశీలన

సంగారెడ్డి టౌన్: కులబ్‌గూర్ గ్రామంలోని ఎస్ఎస్ఎమ్ గోల్డెన్ టౌన్‌షిప్‌ని గురువారం ఆర్డీఓ నగేశ్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించారని అధికారులకు ఫిర్యాదు రావడంతో కుంట (చెరువు) సర్వే చేయాలన్నారు. ఆర్డీవో ఎస్ఆర్‌డి మాట్లాడుతూ చెరువు భూమిని ఆక్రమించుకున్నారా లేదా అని, హైవే ఆవరణలో ప్రభుత్వానికి చెందిన భూమిని గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్, అధికారులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న వీఓఏల సమ్మె

జహీరాబాద్ టౌన్: డిమాండ్‌ల సాధనకు ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల చేపటిన సమ్మె కొనసాగుతుంది. జహీరాబాద్, మొగుడంపల్లి తహసీల్దార్ కార్యాలయాల వద్ద టెంట్లు వేసుకుని సమ్మె చేస్తున్నారు. వీఓఏల యూనియన్ నాయకులు ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ 26న వేలం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పాత వస్తువులను ఈ నెల 26న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పూజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే ఆసక్తి గలవారు 24సాయంత్రం మూడు గంటల వరకు వస్తువుల వివరాలు తెలుసుకొని ధరల వివరాలను సమర్పించాలని సూచించారు.

◆ ఎల్లమ్మ జాతరలో బండ్ల ప్రదక్షిణ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో ఎల్లమ్మతల్లి జాతరలో భాగంగా గురువారం బండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. ఎడ్లబండ్లను రంగురంగుల కాగితాలతో అందంగా అలంకరించి ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

◆ ఫైర్ సేఫ్టీ వీక్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో ఫైర్ సేఫ్టీ వీక్‌లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించామని అగ్నిమాపక శాఖ అధికారి ప్రశాంత్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు– నివారణపై అవగహన సదస్సులు నిర్వహించామన్నారు. గురువారం పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించామని, విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశామన్నారు.